www.eenadupratibha.net

# BOARD OF SECONDARY EDUCATION (TELANGANA)

## SUMMATIVE ASSESSMENT – I

## TENTH CLASS SOCIAL STUDIES MODEL PAPER

## PAPER – II (TELUGU VERSION)

సమయం: 2 గం.45 ని. | పార్టు A & B | గరిష్ఠ మార్కులు: 40

సూచన: మీకిచ్చిన 2 గంటల 45 నిమిషాల సమయంలో 15 నిమిషాలు ప్రశ్నపత్రం చదివి అవగాహన చేసుకోవడానికి, 2.30 గంటలు జవాబులు రాయడానికి కేటాయించారు.

సమయం: 2 గంటలు | పార్టు – A | మార్కులు: 35

### సెక్షన్ – I

సూచనలు: **i)** అన్ని ప్రశ్నలకు 1 – 2 వాక్యాల్లో సమాధానాలు రాయండి.

**ii)** అతిస్వల్ప సమాధాన తరహా ప్రశ్నలు.

**iii)** ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. **7 × 1 = 7**

**1.** 'నోటా' అని దేన్ని అంటారు? దీనిపై సుప్రీంకోర్టు ఏమని వ్యాఖ్యానించింది?

**2.** పార్లమెంటరీ, అధ్యక్ష తరహా ప్రభుత్వ విధానాల మధ్య గల రెండు తేడాలను రాయండి.

**3.** 1946, ఫిబ్రవరి 16న బొంబాయిలో రాయల్ నౌకాదళంలోని భారత సైనికులు నిరాహార దీక్ష ఎందుకు చేపట్టారు?

★ **కింది పటాన్ని పరిశీలించి 4, 5 ప్రశ్నలకు జవాబులు రాయండి.**




**4.** పై పటం ఏ దేశానికి సంబంధించింది? ఆ దేశం ఏ ఖండంలో ఉంది?

**5.** పైన తెలిపిన మూడు ప్రాంతాల్లో ఏయే మతస్తులవారు ఉన్నారు?

★ **కింది వివిధ వార్తా పత్రికల్లోని పతాక శీర్షికలను జాగ్రత్తగా గమనించి 6, 7 ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**




**6.** పై పటంలోని పతాక శీర్షికలు ఎవరి అధికారాల గురించి సూచిస్తున్నాయి?

**7.** భారత ఎన్నికల సంఘం ఏయే ఎన్నికలు నిర్వహిస్తుంది?

www.eenadupratibha.net

## సెక్షన్ – II

సూచనలు: i) అన్ని ప్రశ్నలకు 4 – 5 వాక్యాల్లో సమాధానాలు రాయండి.

ii) స్వల్ప సమాధాన తరహా ప్రశ్నలు.

iii) ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు. **6 × 2 = 12**

**8.** వియత్నాంలో రైలు మార్గాలను, కాలువలను ఫ్రెంచివారు ఎందుకు అభివృద్ధి చేశారు?

**9.** మీ ప్రాంతంలో జరిగిన ఎన్నికలను స్వయంగా లేదా ప్రసార సాధనాల ద్వారా గమనించారా? ఎవరైనా అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అతిక్రమించారా? వాటిని రాయండి.

**10.** మూడో ప్రపంచ యుద్ధం సంభవిస్తే జరిగే పరిణామాలు ఎలా ఉంటాయి?

**11.** 1947 జులైలో సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసే బాధ్యతను ఎవరికి అప్పగించారు? అతడు ఎంతవరకు సఫలీకృతుడయ్యాడు?

**12.** కింది గ్రాఫ్‌ను గమనించి, విశ్లేషిస్తూ రాయండి.




**రేఖాచిత్రం**

1950, జనవరి 26న రాజ్యాంగం అమల్లోకి వచ్చినరోజు నుంచి 2013 వరకు దాదాపు 99 సవరణలు చేశారు.

**13.** కింది పట్టికను చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.

| | |
|---|---|
| ముస్లింలీగ్ పార్టీ ఏర్పాటు | 1906 |
| రాష్ట్ర ప్రభుత్వాలకు ఎన్నికలు | 1937 |
| రాష్ట్ర, కేంద్ర సభలకు ఎన్నికలు | 1946 |
| 'క్విట్ ఇండియా' ఉద్యమం | 1942 |
| రాయల్ నౌకాదళం నిరాహారదీక్ష | 1946 |

ప్రశ్నలు:

i) 'క్విట్ ఇండియా' అంటే ఏమిటి? దీన్ని ఎవరు ప్రారంభించారు?

ii) ఏ సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో 'ముస్లింలీగ్' విజయభేరి మోగించింది?

## సెక్షన్ – III

సూచనలు: i) కిందివాటిలో నాలుగు ప్రశ్నలకు 8 – 10 వాక్యాల్లో సమాధానాలు రాయండి.

ii) దీర్ఘ సమాధాన తరహా ప్రశ్నలు.

iii) ఈ ప్రశ్నలకు అంతర్గత వెసులుబాటు (Internal Choice) ఉంటుంది.

iv) ప్రతి ప్రశ్నకు నాలుగు మార్కులు. **4 × 4 = 16**

**14.** భారత రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలను వివరించండి.

**(లేదా)**

1947లో దేశ విభజన జరిగి భారతదేశం, పాకిస్థాన్‌గా విడిపోయాయి. ఇలా ఎందుకు జరిగింది?

**15.** ఎన్నికల్లో ఓటుహక్కు ప్రాముఖ్యం గురించి తెలిసేలా ప్రజలను చైతన్యవంతం చేయడానికి ఒక కరపత్రాన్ని తయారు చేయండి.

**(లేదా)**

యుద్ధాలను నివారించి, శాంతిని పెంపొందించే కొన్ని నినాదాలను రాయండి.

**16.** నైజర్ డెల్టాలో 1950లో చమురును కనుక్కున్నారు. ప్రస్తుతం ఇది నైజీరియాకు ముఖ్యమైన సహజవనరు. చమురు బావుల్లో అనేకం బహుళజాతి సంస్థల ఆధీనంలో ఉన్నాయి. విదేశీ చమురు కంపెనీలు పర్యావరణాన్ని పట్టించుకోకుండా యథేచ్ఛగా చమురును వెలికితీయడం వల్ల ఎన్నో సమస్యలు ఏర్పడ్డాయి.

పై పేరా చదివి కింది ప్రశ్నకు జవాబు రాయండి.

ప్ర. నైజీరియాలో చమురును వెలికితీయడం వల్ల పర్యావరణానికి జరిగే నష్టాన్ని అంచనా వేయండి.

**(లేదా)**

'ముస్లిం మత పాకిస్థాన్ ఏర్పాటు కావడంతో చాలా మంది ప్రజల ముందు ఊహించని బాధాకరమైన పరిస్థితి ఎదురైంది. కొత్తగా గీసిన సరిహద్దు రేఖకు ఒకవైపున ఉన్న హిందువుల్లో అభద్రతా భావం ఏర్పడి వలస వెళ్లడం తప్పనిసరి అయ్యింది. ఈ కొత్త సరిహద్దు రేఖకు అవతలి వైపున ఉన్న ముస్లింలలో కూడా ఇదే పరిస్థితి'.

ప్ర. దీని పర్యవసానంగా జరిగిన సంఘటనలను వ్యాఖ్యానించండి.

**17.** ప్రపంచ పటంలో కిందివాటిని గుర్తించండి.

a) 1) గ్రీస్

2) రుమేనియా

3) సింగపూర్

4) ఆస్ట్రేలియా

**(లేదా)**

b) 1) క్రీట్

2) బల్గేరియా

3) అంగోలా

4) ప్రపంచంలో అత్యధిక జనాభా ఉన్న దేశం

సమయం: 30 నిమిషాలు | పార్టు – B | మొత్తం మార్కులు: 5

## సెక్షన్ – IV

సూచన: సరైన జవాబును ఎన్నుకుని వాటికి ఎదురుగా ఉన్న బ్రాకెట్‌లో A, B, C, D లలో ఒకదాన్ని రాయండి.

$10 \times \frac{1}{2} = 5$

1. కిందివాటిలో ఆర్థిక మాంద్యం నుంచి తప్పించుకున్న దేశం? ( )
   A) అమెరికా  B) రష్యా  C) జర్మనీ  D) ఏదీకాదు
2. వియత్నాం విషయంలో అమెరికా ప్రజలు తమ ప్రభుత్వాన్ని విమర్శించడానికి కారణం? ( )
   A) వియత్నాంకు సహాయం చేసినందుకు  B) అమెరికా ఓడిపోయినందుకు
   C) తనకు సంబంధం లేని యుద్ధంలో జోక్యం చేసుకున్నందుకు  D) రసాయనిక ఆయుధాలు ఉపయోగించినందుకు
3. చైనాలో భూ సంస్కరణల వల్ల ఏ పరిస్థితులు ఏర్పడ్డాయి? ( )
   A) రైతాంగ సంఘాలు ఏర్పడ్డాయి.  B) మధ్యతరగతి రైతాంగం ఆధిపత్యంలోకి వచ్చింది.
   C) A, B  D) రైతులు ఐక్యమత్యంగా లేకపోవడం.
4. ఏజెంట్ ఆరెంజ్ అనేది? ( )
   A) అత్యంత విషపదార్థం  B) ఆరెంజ్ మొక్కలకు వేసే ఎరువు
   C) యుద్ధనౌక పేరు  D) పడవ పేరు
5. లౌకిక రాజ్యాంగంలోని విశిష్ఠ అంశం? ( )
   A) రాజ్యమతం  B) మత రిజర్వేషన్లు  C) మత విద్యాబోధన  D) మత స్వేచ్ఛ
6. పాకిస్థాన్ లేదా పాక్‌స్థాన్ అనే పేరును రూపొందించినవారు? ( )
   A) చౌదరీ రహ్మత్ అలీ  B) మహ్మద్ ఇక్బాల్  C) మహ్మద్ అలీ జిన్నా  D) మహ్మద్ రఫీ
7. ముసాయిదా రాజ్యాంగంలో ఉన్న అధికరణలు, షెడ్యూళ్ల సంఖ్య ( )
   A) 380, 8  B) 385, 8  C) 390, 8  D) 395, 8
8. కిందివాటిలో సరైంది. ( )
   A) కేంద్ర జాబితాలోని అంశాలపై కేంద్రం మాత్రమే చట్టాలు చేయగలదు.
   B) రాష్ట్ర జాబితాలోని అంశాలపై రాష్ట్రం మాత్రమే చట్టాలు చేయగలదు.
   C) ఉభయ జాబితాలోని అంశాలపై రాష్ట్రాలు, కేంద్రం చట్టాలు చేయవచ్చు.
   D) A, B, C సరైనవే.
9. కిందివాటిలో సరికానిది. ( )
   A) 2011, జనవరి 25ను తొలి ఓటర్ల దినంగా ప్రకటించారు.
   B) ఓటర్లందరినీ కలిపి 'ఎలక్టోరేట్' అంటారు.
   C) ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అతిక్రమిస్తే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటారు.
   D) పై మూడు సరైనవే.
10. ఒకటి లేదా కొన్ని ఖాళీగా ఉన్న స్థానాలకు నిర్వహించే ఎన్నికలను ఏమని పిలుస్తారు? ( )
    A) ఉప ఎన్నికలు  B) సాధారణ ఎన్నికలు  C) మధ్యంతర ఎన్నికలు  D) ఏదీకాదు

# జవాబులు

## పార్టు – A

## సెక్షన్ – I

**1. 'నోటా' అని దేన్ని అంటారు? దీనిపై సుప్రీంకోర్టు ఏమని వ్యాఖ్యానించింది?**

జ: ★ ఎన్నికల్లో ఓటింగ్ కోసం ఉపయోగించే ఈ.వి.యం. (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)లో ఆఖరున ఉన్న గుర్తును 'నోటా' అంటారు.

★ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులెవరికీ ఓటు వేయడానికి ఇష్టపడని పక్షంలో ఓటరు ఈ గుర్తుపై నొక్కవచ్చు.

★ నోటా అనేది వ్యక్తి భావప్రకటన, స్వేచ్ఛలో భాగమని 'సుప్రీంకోర్టు' వ్యాఖ్యానించింది.

**2. పార్లమెంటరీ, అధ్యక్ష తరహా ప్రభుత్వ విధానాల మధ్య గల తేడాలను రాయండి.**

జ. ★ అధ్యక్ష తరహా వ్యవస్థ ప్రభుత్వంలో కార్యనిర్వాహక వర్గానికి అధిపతిగా అధ్యక్షుడు ఉంటాడు. పరిపాలనా బాధ్యత అతడి కింద ఉంటుంది.

★ పార్లమెంటరీ తరహా ప్రభుత్వంలోని అధ్యక్షుడు రాజ్యానికి అధిపతి కానీ కార్యనిర్వాహక వర్గానికి కాదు. అతడు దేశానికి ప్రాతినిధ్యం వహిస్తాడు కానీ దేశాన్ని పాలించడు.

**3. 1946, ఫిబ్రవరి 16న బొంబాయిలో రాయల్ నౌకాదళంలోని భారతసైనికులు నిరాహారదీక్ష ఎందుకు చేపట్టారు?**

జ: నాసిరకం ఆహారం, తమపట్ల బ్రిటిష్ అధికారుల ప్రవర్తనకు నిరసనగా రాయల్ నౌకాదళంలోని భారత సైనికులు నిరాహారదీక్ష చేపట్టారు.

**★ కింది పటాన్ని పరిశీలించి 4, 5 ప్రశ్నలకు జవాబులు రాయండి.**




**4. పై పటం ఏ దేశానికి సంబంధించింది? ఆ దేశం ఏ ఖండంలో ఉంది?**

జ. ★ పై పటంలో ఉన్న దేశం 'నైజీరియా'.

★ నైజీరియా ఆఫ్రికా ఖండంలో ఉంది.

**5. పైన తెలిపిన మూడు ప్రాంతాల్లో ఏయే మతస్థులవారు ఉన్నారు?**

జ. ★ ఉత్తర నైజీరియాలో హౌసా – పులాని ప్రజలు అధికంగా ఉన్నారు. ముఖ్యంగా వీరు ముస్లింలు.

★ ఆగ్నేయ, నైరుతీ భాగంలో ఈబో, యొరుబా తెగల ప్రజలు అధికంగా ఉన్నారు.

★ దక్షిణ ప్రాంతాల్లో క్రైస్తవ మతస్థులు అధిక సంఖ్యలో ఉన్నారు.

★ కింది వివిధ వార్తా పత్రికల్లోని పతాక శీర్షికలను జాగ్రత్తగా గమనించి **6, 7** ప్రశ్నలకు సమాధానాలు రాయండి.




**6.** **పై పటంలోని పతాక శీర్షికలు ఎవరి అధికారాల గురించి సూచిస్తున్నాయి?**

జ. పైపటంలోని పతాక శీర్షికలు 'భారత ఎన్నికల సంఘం' (E.C. – ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా) అధికారాల గురించి సూచిస్తున్నాయి.

**7.** **భారత ఎన్నికల సంఘం ఏయే ఎన్నికలు నిర్వహిస్తుంది?**

జ: భారత ఎన్నికల సంఘం దేశంలో లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్ర శాసన సభలు, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలను నిర్వహిస్తుంది.

## సెక్షన్ – II

**8.** **వియత్నాంలో రైలు మార్గాలను, కాలువలను ఫ్రెంచివారు ఎందుకు అభివృద్ధి చేశారు?**

జ: 19వ శతాబ్దం మధ్య కాలం నాటికి వియత్నాం ఫ్రెంచి ప్రత్యక్ష పాలన కిందకు వచ్చింది.

★ భారతదేశాన్ని బ్రిటన్ ప్రభావితం చేసిన విధంగానే వియత్నామీయుల జీవితాల్లోని అన్ని అంశాలను ఫ్రెంచివారు ప్రభావితం చేశారు.

★ వరి ఉత్పత్తిని పెంచి, దాన్ని అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయడానికి ఫ్రెంచివారు వియత్నాంలో కాలువలను అభివృద్ధి చేశారు.

★ వాణిజ్య సరకుల రవాణా కోసం, సైనిక కేంద్రాలను తరలించడానికి, మొత్తం ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకునేందుకు రోడ్డు, రైలు మార్గాలను అభివృద్ధి చేశారు.

**9.** **మీ ప్రాంతంలో జరిగిన ఎన్నికలను స్వయంగా లేదా ప్రసార సాధనాల ద్వారా గమనించారా? ఎవరైనా అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అతిక్రమించారా? వాటిని రాయండి.**

జ: కొంత మంది అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అతిక్రమించినట్లు కొన్ని వాస్తవంగా, మరికొన్ని ప్రసార సాధనాల ద్వారా గమనించాను.

★ తనకే ఓటువేయమని డబ్బులు పంచడం.

★ మీది, మాది ఒకటే కులం, నాకే ఓటెయ్యమని అడగటం.

★ నాకు ఓటు వేయకపోతే మీ అంతుచూస్తానని బెదిరించడం.

★ ఓటర్లు పోలింగ్ బూత్‌కు వెళ్లడానికి వాహనాలను సమకూర్చడం.

★ వ్యక్తిగత దూషణకు పాల్పడటం.

★ గడువు దాటినా ప్రచారం చేయడం.

**10.** **మూడో ప్రపంచ యుద్ధం సంభవిస్తే జరిగే పరిణామాలు ఎలా ఉంటాయి?**

జ: మూడో ప్రపంచ యుద్ధం సంభవిస్తే జరిగే నష్టం మేధావుల అంచనాలకు కూడా అందనిది.

పరిణామాలు:

★ రెండు ప్రపంచ యుద్ధాల వల్ల మరణించిన వారికంటే ఎన్నో రెట్లు ఎక్కువ జనాభా మరణించవచ్చు, గాయపడవచ్చు.

★ విపరీతమైన ఆస్తి నష్టం జరిగి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం అవుతుంది.

★ అణుబాంబులు, రసాయనిక ఆయుధాలను ఉపయోగించడం వల్ల భూ ఉపరితలం చాలా వరకు నిస్సారమవుతుంది.

★ కొన్ని దేశాలు నామరూపాలు లేకుండా కనుమరుగవుతాయి.

★ ఆల్‌బర్ట్ ఐన్‌స్టీన్ చెప్పినట్లుగా నాలుగో ప్రపంచ యుద్ధంలో కొట్టుకోవడానికి రాళ్లు, కర్రలు మిగులుతాయి.

**11. 1947 జులైలో సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసే బాధ్యతను ఎవరికి అప్పగించారు? అతడు ఎంత వరకు సఫలీకృతుడయ్యాడు?**

జ: ★ 1947 జులైలో ఈ బాధ్యతను సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు అప్పగించారు.

★ భారతదేశంలో విలీనం కావాల్సిన ఆవశ్యకత గురించి అతడు రాచరిక కుటుంబాలతో చర్చించాడు.

★ వారు తమంతట తాము విలీనం కాకపోతే ఆ ప్రక్రియను పూర్తిచేయడానికి సైన్యాన్ని పంపించాల్సి ఉంటుందని కూడా తెలియజేశాడు.

★ 1947, ఆగస్టు 15 నాటికి కశ్మీర్, హైదరాబాదు, జునాగఢ్‌లు తప్పించి మిగిలిన సంస్థానాలన్నీ భారతదేశంతో విలీన ఒప్పంద పత్రంపై సంతకం చేశాయి.

★ సర్దార్ వల్లభాయ్ పటేల్ తన ప్రణాళిక ప్రకారం ఎలాంటి ఘర్షణ వాతావరణం లేకుండా అనేక సంస్థానాలను భారతదేశంలో విలీనం చేయించగలిగాడు.

**12. కింది గ్రాఫ్‌ను గమనించి, విశ్లేషిస్తూ రాయండి.**




**రేఖాచిత్రం**

1950, జనవరి 26న రాజ్యాంగం అమల్లోకి వచ్చినరోజు నుంచి 2013 వరకు దాదాపు 99 సవరణలు చేశారు.

జ: ★ 1950, జనవరి 26న రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజు నుంచి 2013 వరకు జరిగిన సవరణలను పై రేఖాచిత్రం తెలియజేస్తుంది.

★ చట్టాలను అప్పుడప్పుడు సవరించాల్సిన అవసరం ఏర్పడుతుందని రాజ్యాంగ నిర్మాతలు గుర్తించారు.

★ అవసరాన్ని బట్టి 1951 నుంచి 2013 వరకు దాదాపుగా 99 సవరణలు చేశారు.

★ 1951 – 60 మధ్య 7 సవరణలు చేశారు. ఈ దశాబ్దంలోనే తక్కువ సవరణలు జరిగాయి.

★ 1971 – 80, 1981 – 90లలో అత్యధిక సవరణలు (22 + 22) జరిగాయి.

★ 1970లో రాజ్యాంగానికి ప్రధాన మార్పులు చేశారు.

★ కాలానుగుణంగా సమాజంలో మార్పులు జరుగుతున్నాయి కాబట్టి చట్టాలను మార్చాల్సిన ఆవశ్యకత ఎంతయినా ఉంది.

www.eenadupratibha.net

**13.** **కింది పట్టికను చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.**

| | |
|---|---|
| ముస్లింలీగ్ పార్టీ ఏర్పాటు | 1906 |
| రాష్ట్ర ప్రభుత్వాలకు ఎన్నికలు | 1937 |
| రాష్ట్ర, కేంద్ర సభలకు ఎన్నికలు | 1946 |
| క్విట్ ఇండియా ఉద్యమం | 1942 |
| రాయల్ నౌకాదళం నిరాహార దీక్ష | 1946 |

**i) 'క్విట్ ఇండియా' అంటే ఏమిటి? దీన్ని ఎవరు ప్రారంభించారు?**

జ: 'క్విట్ ఇండియా' అంటే 'భారతదేశాన్ని వదిలి వెళ్లండి' అని అర్థం.

★ దీన్ని మహాత్మా గాంధీ ప్రారంభించారు.

★ క్రిప్స్ దౌత్యం విఫలమైన తర్వాత బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా గాంధీజీ ఈ ఉద్యమాన్ని మొదలు పెట్టారు.

**ii) ఏ సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో 'ముస్లింలీగ్' విజయభేరి మోగించింది?**

జ: ★ 1946లో రాష్ట్ర, కేంద్ర సభలకు ఎన్నికలు జరిగినప్పుడు ముస్లిం నియోజక వర్గాల్లో ముస్లింలీగ్ విజయభేరి మోగించింది.

## సెక్షన్ – III

**14.** **భారత రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలను వివరించండి.**

జ: **భారత రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలు**

**సార్వభౌమత్వం:** భారతదేశం అంతర్గతంగా, బాహ్యంగా స్వేచ్ఛ – స్వాతంత్ర్యాలను కలిగి ఉందని రాజ్యాంగం తెలియజేస్తుంది.

**సామ్యవాదం:** సామ్యవాదం అనే పదాన్ని 42వ సవరణ ద్వారా రాజ్యాంగంలో చేర్చారు. రాజ్యం క్రమేణా అవసరమైన మార్పులను తెచ్చి సమ సమాజాన్ని స్థాపించడం అని దీని అర్థం.

**పార్లమెంటరీ ప్రజాస్వామ్య విధానం:** శాసన, కార్యనిర్వాహక శాఖల అధికారాల సమన్వయంపై ఆధారపడి ప్రభుత్వం పనిచేస్తే దాన్ని 'పార్లమెంటరీ విధానం' అంటారు. ప్రజల చేత, ప్రజల కోసం నడిచే ప్రభుత్వమే 'ప్రజాస్వామ్య ప్రభుత్వం'.

**సమాఖ్య విధానం:** ప్రభుత్వాధికారాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య రాజ్యాంగ బద్ధంగా పంపిణీ అయ్యే ప్రభుత్వ విధానాన్నే 'సమాఖ్య విధానం' అంటారు.

**న్యాయం:** భారత రాజ్యాంగంలోని ఈ 'న్యాయం' అనే సూత్రం పౌరులకు రాజకీయ, ఆర్థిక సాంఘిక న్యాయాలను అందిస్తుంది.

**స్వేచ్ఛ స్వాతంత్ర్యం:** భారతదేశంలోని ప్రతివ్యక్తికీ ఆలోచనా స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛ, విశ్వాసం, మత స్వేచ్ఛ, ధర్మం లాంటివి రాజ్యాంగం కల్పిస్తుంది.

**సమానత్వం:** రాజ్యాంగం ప్రతి వ్యక్తీ తనను తాను పూర్తిగా అభివృద్ధి చేసుకోవడానికి సమాన హోదా, అవకాశాలు కల్పించింది.

**సంక్షేమ రాజ్యం:** ఆధునిక రాజ్యాలన్నీ సంక్షేమ రాజ్యాలే. ప్రజల సంక్షేమానికి అవసరమైన చట్టాలను చేయడానికి రాజ్యాంగం అవకాశం కల్పించింది.

**(లేదా)**

ప్ర. **1947లో దేశ విభజన జరిగి భారతదేశం, పాకిస్థాన్‌గా విడిపోయాయి. ఇలా ఎందుకు జరిగింది?**

జ: 1906లో ఏర్పడిన 'ముస్లిం లీగ్'కు 1930 వరకు ప్రజల మద్దతు అంతగా లేదు. ఆ తర్వాత ముస్లింల ఆలోచనల్లో మార్పు వచ్చింది. ముస్లింలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో పాలనకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలనే భావన చాలా మందిలో ఏర్పడింది. ఈ భావనే భారతదేశం రెండు భాగాలుగా విడిపోవడానికి కారణమైంది.

www.eenadupratibha.net

**విభజనకు దారి తీసిన వివిధ పరిస్థితులు:**

★ 'సారే జహాసే అచ్చా హిందుస్థాన్ హమారా' కవిత రాసిన ఉర్దూ కవి మహ్మద్ ఇక్బాల్ 1930లో ముస్లిం లీగ్‌కు అధ్యక్షోపన్యాసం చేస్తూ 'వాయవ్య ముస్లిం రాష్ట్ర' ఆవశ్యకత గురించి మాట్లాడారు.

★ కేంబ్రిడ్జ్‌లో చదువుతున్న పంజాబ్ ముస్లిం విద్యార్థి 'చౌదరీ రహ్మత్ అలీ' ముస్లిం వర్గానికి ప్రత్యేక జాతీయ ప్రతిపత్తి కల్పించాలనే అభిప్రాయంతో 'పాకిస్థాన్' అనే పదానికి రూపకల్పన చేశాడు.

★ 1940, మార్చి 23న ఉపఖండంలో ముస్లింలు అధిక సంఖ్యలో ఉన్న ప్రాంతాల్లో కొంత స్వయం ప్రతిపత్తిని కోరుతూ ముస్లింలీగ్ ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టింది.

★ బ్రిటన్ అనుసరించిన 'విభజించి – పాలించు' అనే విధానం ముస్లిం లీగ్ బలపడేలా చేసింది.

★ చర్చలతో స్వాతంత్ర్యం రాదని భావించిన లీగ్ ప్రత్యక్ష కార్యాచరణకు దిగడంతో అనేక అల్లర్లు జరిగి హింసకు దారి తీసింది.

★ చివరకు 1947, ఆగస్టు 14న పాకిస్థాన్‌కు స్వాతంత్ర్యం ఇస్తామని మౌంట్ బాటన్ ప్రకటించాడు.

**15.** **ఎన్నికల్లో ఓటు హక్కు ప్రాముఖ్యం గురించి ప్రజలను చైతన్యవంతం చేయడానికి ఒక కరపత్రాన్ని తయారు చేయండి.**

జ: **ఓటు హక్కు వినియోగించుకో – ప్రజాస్వామ్యాన్ని రక్షించుకో**

ప్రజాస్వామ్య ప్రభుత్వాలున్న దేశాల్లో ఓటు హక్కుకు చాలా ప్రాధాన్యం ఉంది. ప్రపంచంలో భారతదేశం అతిపెద్ద ప్రజాస్వామిక దేశం. కుల, మత, లింగ, జాతి, భాషాపరమైన భేదాలు లేకుండా 18 ఏళ్లు నిండిన ప్రతి భారతీయుడు ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. దీన్నే 'సార్వజనీన ఓటుహక్కు' అంటారు.

అయిదేళ్లకు ఒకసారి ప్రజా ప్రతినిధులను మనం ఎన్నుకుంటూ ఉంటాం. పాలక ప్రభుత్వం దాని బాధ్యతలను సంతృప్తికరంగా ప్రదర్శించడం లేదని భావిస్తే తర్వాత ఎన్నికల్లో ఓటు హక్కు ద్వారా వారిని పదవీచ్యుతలను చేయవచ్చు.

ఓటు అనేది హక్కు మాత్రమే కాదు ఒక బాధ్యత కూడా. ఓటు వేయకపోతే ఏ హాని ప్రస్తుతం కలగకపోవచ్చు. కానీ దీర్ఘకాలంలో దాని ఫలితం ప్రమాదకరంగా ఉంటుంది.

నా ఒక్క ఓటు వేయకపోతే ఏంటి, నాకు ఖాళీ లేదు, నాకు వేరే ముఖ్యమైన పని ఉంది అని అనుకోకూడదు. నీవు ఓటు హక్కు సరిగ్గా వినియోగించుకోకపోతే, 5 సంవత్సరాల వరకు నెగ్గినవాడు మంచివాడు కాకపోయినా అతడిని భరించాల్సిందే. కాబట్టి గౌరవ ప్రదంగా వచ్చిన ఓటును ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా మంచి వ్యక్తులను ఎన్నుకోండి. ప్రజలను, దేశాన్ని రక్షించండి.

**ఓటు హక్కు ప్రజలకు వజ్రాయుధం**

**(లేదా)**

ప్ర. **యుద్ధాలను నివారించి, శాంతిని పెంపొందించే కొన్ని నినాదాలను రాయండి.**

జ: 'దేశాల మధ్య గతవులాట లొద్దు
శాంతియుతంగా ఉంటేనే ముద్దు'
'కలసి మెలసి జీవిద్దాం
ప్రపంచ శాంతిని నెలకొల్పుదాం'
'యుద్ధాలను ఆపేద్దాం
ప్రశాంతంగా జీవిద్దాం'
'కలసి ఉంటే కలదు సుఖం
తగవులాడుకుంటే తప్పదు ప్రళయం'
'అణుబాంబుల తయారీ వద్దు
ప్రపంచ ప్రజల సౌభాగ్యమే ముద్దు'
'ఆయుధ కర్మాగారాలను మూసేద్దాం
స్నేహ సందేశాలను పంపుకుందా'

**16.** **నైజర్ డెల్టాలో 1950లో చమురును కనుక్కున్నారు. ప్రస్తుతం ఇది నైజీరియాకు ముఖ్యమైన సహజవనరు. చమురు బావుల్లో అనేకం బహుళజాతి సంస్థల ఆధీనంలో ఉన్నాయి. విదేశీ చమురు కంపెనీలు పర్యావరణాన్ని పట్టించుకోకుండా యథేచ్ఛగా చమురును వెలికితీయడం వల్ల ఎన్నో సమస్యలు ఏర్పడ్డాయి.**

**పై పేరా చదివి కింది ప్రశ్నకు జవాబు రాయండి.**

ప్ర. **నైజీరియాలో చమురును వెలికితీయడం వల్ల పర్యావరణానికి జరిగే నష్టాన్ని అంచనా వేయండి.**

జ: **నైజీరియాలో చమురు వెలికితీయడం వల్ల జరిగే నష్టాలు:**

★ నైజీరియా తీరప్రాంతం అనేక సమస్యలకు నిలయమైంది.

★ చమురు బావుల నుంచి వచ్చే వ్యర్థాలు, చమురు సముద్రపు నీటిలో కలవడం వల్ల అక్కడి జీవావరణ వ్యవస్థ ప్రభావితమవుంది.

★ మడ అడవులు చమురుకు తట్టుకోలేవు. ఈ చమురు నేలలోకి ఇంకి, ప్రతి సంవత్సరం ముంపుకి గురైనప్పుడు తిరిగి నీటిపైకి రావడం వల్ల చాలా విస్తీర్ణంలో మడ అడవులు అంతరించిపోయాయి.

★ చమురు వల్ల నేలలు, భూగర్భ జలాలు కలుషితమై పంటలు నాశనమవుతున్నాయి.

★ తాగునీరు కూడా తరచూ కలుషితమవుతుంది.

★ నీటి కాలుష్యం అనేది ఆరోగ్యంపై వెంటనే ప్రభావితం చూపనప్పటికీ, దీర్ఘకాలంలో క్యాన్సర్ లాంటి సమస్యలు రావచ్చు.

★ సముద్ర జలాల్లో చమురు ఊటలు చాలా ఎక్కువగా ఉండి, తీరప్రాంత పర్యావరణం ప్రభావితమై స్థానికంగా చేపల ఉత్పత్తి పడిపోతుంది.

★ నైజీరియా తన భౌతిక వనరులపై నియంత్రణను సాధించడానికి ఇంకా ప్రయత్నాలు చేస్తూనే ఉంది.

**(లేదా)**

**'ముస్లిం మత పాకిస్థాన్ ఏర్పాటు కావడంతో చాలా మంది ప్రజల ముందు ఊహించని బాధాకరమైన పరిస్థితి ఎదురైంది. కొత్తగా గీసిన సరిహద్దు రేఖకు ఒకవైపున ఉన్న హిందువుల్లో అభద్రతా భావం ఏర్పడి వలస వెళ్లడం తప్పనిసరి అయ్యింది. ఈ కొత్త సరిహద్దు రేఖకు అవతలి వైపున ఉన్న ముస్లింలలో కూడా ఇదే పరిస్థితి'.**

ప్ర. **దీని పర్యవసానంగా జరిగిన సంఘటనలను వ్యాఖ్యానించండి.**

జ: దేశ విభజన అందరూ కోరుకుని ఉండకపోవచ్చు. ఇది ఎందుకు జరుగుతుందో అందరికీ అర్థమై ఉండకపోవచ్చు. తమ ఇల్లు, ఊరు, పట్టణాలను విడిచి వెళ్లాల్సి రావడంతో ఒకరిపట్ల ఒకరికి కోపం, విద్వేషాలు ఏర్పడ్డాయి.

★ 1.5 కోట్ల మంది హిందువులు, ముస్లింలు నిర్వాసితులయ్యారు.

★ హత్యలు, దోపిడీలు, దహనాలు యథేచ్ఛగా కొనసాగాయి.

★ రెండు లక్షల నుంచి అయిదు లక్షల మంది హిందువులు, ముస్లింలు చనిపోయారు.

★ కొందరు కాందిశీకులుగా మారి పునరావాస శిబిరాల్లో గడిపారు.

★ కొత్త ఇండ్ల అన్వేషణకు రైళ్లలో బయలుదేరారు.

★ గాంధీజీ శాంతి, సౌభ్రాతృత్వ సందేశాలను పెంచుతూ అల్లర్లకు గురైన ప్రజల శిబిరాల మధ్య గడిపారు.

★ తను ఇంతగా కష్టపడింది ఇలాంటి స్వేచ్ఛ, స్వరాజ్యాల కోసం కాదని గాంధీజీ చింతించారు.

www.eenadupratibha.net

17. ప్రపంచ పటంలో కిందివాటిని గుర్తించండి.

a) 1) గ్రీస్

2) రుమేనియా

3) సింగపూర్

4) ఆస్ట్రేలియా

జ:




www.eenadupratibha.net

(లేదా)

b) 1) క్రీట్

2) బల్గేరియా

3) అంగోలా

4) ప్రపంచంలో అత్యధిక జనాభా ఉన్న దేశం

జ:




## పార్టు – B

### జవాబులు

1-B; 2-C; 3-C; 4-A; 5-D; 6-A; 7-D; 8-D; 9-D; 10-A.

రచయిత: బొమ్మిడి నారాయణ రావు

www.eenadupratibha.net